# నేటి నిజం

తెలుగు దినపత్రిక

E-mail : netinijam93@gmail.com    website:www.netinijam.com

హైదరాబాద్    మంగళవారం 8-11-2022    RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    సంపుటి :29    సంచిక: 73    పేజీలు:6    వెల: రూ.1/-


## ఎన్నిక ఏదైనా ప్రజలంతా కేసీఆర్ వెంటే - ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, నవంబర్ 7:కార్తీక పౌర్ణమి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. మునుగోడులో టీఆర్ఎస్ పార్టీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్ని రోజులు అవక్కులు చవాకులు చేసిన బీజేపీ నేతలకు మునుగోడు ప్రజలు సరైన సమాధానం ఇచ్చారని అన్నారు. నల్గొండలో హ్యాట్రిక్ సాధించామని ఇక తెలంగాణలో ఏ ఎన్నిక జరిగిన ప్రజలంతా టీఆర్ఎస్ వైపే ఉంటారనే విశ్వాసం తనకు ఉందని చెప్పారు. ప్రతి ఏడు లాగానే ఈసారి కూడా కార్తీక పౌర్ణమి సందర్భంగా నీలకంటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాలని చెప్పారు. ఆలయంలో స్వామివారి రథం అవసరం ఉన్నట్లు ఆలయ కమిటీ వారు అడిగారని ఇందుకోసం 50 లక్షలతో రథాన్ని ఏర్పాటు చేయిస్తానని వెల్లడించారు. ఎంతో మహిమగల నీలకంటేశ్వరున్ని కార్తీక పౌర్ణమి సందర్భంగా దర్శించుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ తెలిపారు.

## దరఖాస్తులపై సత్వర పరిష్కారం

ఖమ్మం, నవంబర్ 7: (నేటినిజం ప్రతినిధి): ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి. పి. గౌతమ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ మందిరంలో నిర్వహించిన "గ్రీవెన్స్ డే" లో అర్జీదారులను నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా, ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెంకు చెందిన సత్తి వెంకన్న తనకు సర్వే నెం. 252/అ1, 664/అ1, 662/ఆ1 లలో 30 కుంటల భూమి మిస్సింగ్ సర్వే నెం. లుగా వున్నదని, అట్టి దానిని ఆమోదం కొరకు దరఖాస్తు చేసియున్నట్లు, పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరగా, ధరణి సూపరింటెండెంట్ ను పరిశీలనకై కలెక్టర్ ఆదేశించారు. పాతర్లపాడు గ్రామం చింతకాని మండలం నుండి జి. మరియమ్మ, ఎం. నాగమణి, సిహెచ్. మౌనిక లు, తాము దళితబంధు మంజూరు యూనిట్ కు షెడ్ల నిర్మాణానికి డబ్బులు రాలేదని, మంజూరు కు కోరగా, ఎస్సి కార్పొరేషన్ ఇడికి తగు చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు చెందిన దివ్యాంగులు ప్రతి సంవత్సరం దివ్యాంగుల బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి దివ్యాంగుల శాఖ వేరుచేయాలని, దివ్యాంగులకు దళితబంధు వెంటనే అమలు చేయాలని, ప్రతి మొదటి శనివారం దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ డే చేపట్టాలని కోరగా, జిల్లా సంక్షేమ అధికారిణికి పరిశీలనకై కలెక్టర్ ఆదేశించారు.

పెనుబల్లి మండలం, ఏరుగట్ల గ్రామం నుండి కె. సీతారామయ్య తనకు పోడు భూమి సర్వే విషయంలో అన్యాయం జరిగినట్లు, న్యాయం చేయగలందులకు దరఖాస్తు చేయగా, పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం రాజలింగాల గ్రామం నుండి కె. సత్యనారాయణ, తనకు బురదరాఘవాపురం రెవిన్యూ సర్వే నెం. 512 లో 5 ఎకరాల మెట్ట భూమి విషయంలో వారసత్వా భూమి విషయంలో చర్యలకు కోరగా, తహసీల్దార్, డిపిఓలు చర్యలు కలెక్టర్ ఆదేశించారు. ముదిగొండ మండలం వెంకటాపురం ఎస్సి కాలనీ నుండి టి. పూర్ణచందర్ రావు, తన ఇంటి వెనుక భాగంలో అక్రమంగా ప్రవేశించి, ప్రహారి గోడ పగులగొట్టినట్లు, భయ భ్రాంతులకు గురిచేస్తున్నట్లు చర్యలకై కోరగా, డిపివో ను విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీ నుండి ఆత్మకూరి వాణి తాను వితంతువునని, ఇంటి స్థలం, వితంతు పెన్షన్ పునరుద్ధరణ కు కోరగా, డిఆర్డీవో ను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వైరా మండలం తాటిపూడి గ్రామం నుండి కె. సైదుబాబు, తనకు ఆగిపోయిన వికలాంగుల పెన్షన్ తిరిగి ఇప్పించగలందులకు దరఖాస్తు చేయగా, డిఆర్డీవో కు చర్యలకై కలెక్టర్ ఆదేశించారు.

చింతకాని మండలం నాగులవంచ నుండి వి. గోపాల్ రావు, తాను గ్రామంలో ఎన్ఆర్జిసి నిధులతో సిసి రోడ్ల నిర్మాణం చేసినట్లు, ఎంబి లు లేని కారణంగా బిల్లులు రాలేదని, విచారణ చేసి చర్యలకై కోరగా, పీఆర్ ఇఇ ని వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గోవిందాపురం గ్రామం, బోనకల్ మండలం నుండి మార్కాపుడి సుగుణ అంగన్వాడీ ఆయా నియామకం కొరకు కోరగా, జిల్లా సంక్షేమ అధికారిణి ని పరిశీలన చేసి, చర్యలకై కలెక్టర్ ఆదేశించారు.

కొనిజర్ల మండలం మేకలకుంట గ్రామం నుండి తేజావత్ అశోక్ తమ గ్రామంలో పారిశుధ్య సేవలు సరిగా లేనట్లు చర్యలకై కోరగా, జిల్లా పంచాయతీ అధికారిని చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. ఇట్టి "గ్రీవెన్స్ డే"లో అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్. మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి శిరీష, ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకపూర్ణిమ

పరుచుకొన్న వెన్నెలలో
పరవశిస్తున్న రాత్రి
పుణ్యనదీస్నానాలతో
పులకించిపోతున్న ధాత్రి
ప్రజ్వలిస్తున్న దీపాలతో
ఉజ్జ్వలిస్తున్న భక్తి
శివకేశవారాధనలతో
చిందులువేస్తున్న శక్తి
కళ్లముందే కనబడుతున్న ముక్తి
కార్తీకం ముంగిట వెలిగే ఆర్తికం
భువనాన్ని కాంతిమయం చేస్తోంది
ఉత్తమలోకాలకు తలుపులు తీస్తోంది!



డా॥ అయాచితం నటేశ్వరశర్మ
9440468557.

### చరిత్రలో నేటినిజం



కం॥ మానవ సంగీతములో
రాణిగ వెలుగొందె యుగళ మకుటంబుగా
రాణించె డా॥ఉష తనదగు
గానములో విశ్వమందు ఖ్యాతి వహించెన్!!

(నవంబర్ 8 ఉషా ఊతుప్ జననం..)



–రాధశ్రీ
సెల్:9494481210

## మోదీ కార్పొరేట్ ఎత్తుగడలు మునుగోడులో చిత్తు : టీఆర్ఎస్ ఎంపీలు




హైదరాబాద్, నవంబర్ 7:మోదీ కార్పొరేట్ ఎత్తులు మునుగోడులో చిత్తయ్యాయని టీఆర్ఎస్ ఎంపీలు పేర్కొన్నారు. టీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఎంపీలు వెంకటేష్ నేత, మాలోత్ కవిత, మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనేశ్ నేత మాట్లాడుతూ మునుగోడు ఓటర్లు టీఆర్ఎస్‌కు, సీఎం కేసీఆర్ అండగా నిలిచారన్నారు. ఓడిపోయిన బండి సంజయ్ చిన్న పిల్లాడిలా మాట్లాడుతున్నారని, ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ న్యాయం కోసం యుద్ధం చేసిందన్నారు. బండి సంజయ్ ఓ అజ్ఞాని అని, డబ్బు పంచి గెలిచారనడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల సంఘం కేంద్రం చేతిలో ఉంటుందని బండికి తెలియదా అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్‌ను అడ్డుకునేందుకు మోదీ, అమిత్ షా మునుగోడు ఉప ఎన్నిక తెచ్చారని, బీజేపీ ఓ డ్రామా కంపెనీలా తయారైందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేసి మునుగోడులో గెలవాలని చూశారని, ఓటర్లు ఆ ప్రయత్నాన్ని తిప్పికొట్టారన్నారు. రూ. 18వేల కోట్ల కాంట్రాక్టు కోసమే ఉప ఎన్నిక వచ్చిందని, రాజీనామా చేస్తేనే కాంట్రాక్టు ఇస్తామని మోదీ, అమిత్‌షా రాజగోపాల్‌ను బెదిరించారన్నారు. రాజ్యాంగ బద్ధంగానే ఇతర పార్టీ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరారని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తీసుకోలేదని, బీజేపీ పలు రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వాలను మార్చిందన్నారు.

బట్టేబాజ్ బీజేపీ పార్టీ ప్రభుత్వాలను మార్చేందుకు కోట్ల రూపాయాలను వెచ్చించిందని, అరుణాచల్‌ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మణిపూర్, గోవా, సిక్కింలో బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు నీతి, జాతి లేని రాజకీయాలు లేదా? అని నిలదీశారు. బండి సంజయ్ ఇప్పటికైనా జ్ఞానం పెంచుకోవాలని, బీజేపీ నేత వివేక్ అవివేకి, సిగ్గులేని దద్దమ్మ అని మండిపడ్డారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించి రెడ్ హ్యాండెడ్‌గా దొరికి పోయిన దొంగల పార్టీ బీజేపీ అని, ఆ పార్టీకి తెలంగాణ లో స్థానం లేదన్నారు. బీఆర్ఎస్‌కు దేశమంతటా ఆదరణ లభిస్తోందన్నారు. మునుగోడు తీర్పు బీఆర్ఎస్ బలోపేతానికి బాటలు వేసిందన్నారు.

### మునుగోడు ప్రజలు ధర్మాన్ని నిలబెట్టారు : మాలోత్ కవిత

బీజేపీ నేతలు అబద్ధాలు మాట్లాడడం తగ్గించుకోవాలని ఎంపీ మాలోత్ కవిత సూచించారు. మునుగోడులో

తెలంగాణ ధర్మాన్ని ప్రజలు నిలబెట్టారని, పరీక్షా సమయంలో తెలంగాణ వైపు నిలబడ్డ మునుగోడు ఓటర్లకు పాదాభివందనాలు తెలుపుతున్నానన్నారు. వేరే రాష్ట్రాల్లో బీజేపీ కూడా గెలిచింది.. అక్కడ కూడా అధికార దుర్వినియోగం చేసి గెలిచారా ..? అని ప్రశ్నించారు. రాజకీయాల్లో అట్టర్ ఫ్లాప్ నేత వివేక్ అని విమర్శించారు. ఆయనకు కేటీఆర్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. హుజూరాబాద్‌కు వివేక్ డబ్బులే వెళ్లాయని, మునుగోడుకు వివేక్ డబ్బులే వెళ్లాయన్నారు. వివేక్ డబ్బు రాజకీయాలను మునుగోడు ప్రజలు తిరస్కరించారని, తెలంగాణలో బీజేపీకి ఆదరణ ఉండదని ప్రజలు తేల్చారన్నారు. మతోన్మాద శక్తులకు మునుగోడు గట్టి గుణపాఠం చెప్పారన్నారు. మునుగోడు మా సీటు కాకున్నా గెలిచి చూపించామని, ఇప్పటికైనా బీజేపీ నేతలు బుద్ధి తెచ్చుకోవాలని, లేకుంటే ప్రజలు తరిమికొడుతారని హెచ్చరించారు.

### బీఆర్ఎస్‌ను ప్రజలు ఆశీర్వదించారు : మన్నె శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ మోడల్ దేశానికి కావాలని మునుగోడు ప్రజలు బీఆర్ఎస్‌ను ఆశీర్వదించారని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉపఎన్నిక తెచ్చిన బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిర పరచాలని ప్రయత్నించిన బీజేపీకి మునుగోడులో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. మునుగోడులో టీఆర్ఎస్ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్, మిత్రపక్షాలే గెలుస్తాయన్నారు. ఇతర రాష్ట్రాల్లో రాజకీయం చేసినట్టు బీజేపీ తెలంగాణలో చేస్తే కుదరదు అని, కారును పోలిన గుర్తులు లేక పోతే టీఆర్ఎస్ మెజారిటీ ఇంకా పెరిగేదన్నారు. తెలంగాణ అభివృద్ధికి పనికొచ్చే పనులను బీజేపీ చేసే మంచిదని, బీజేపీ మాయమాటలకు తెలంగాణలో స్థానం లేదని స్పష్టం చేశారు.

## అగ్రవర్ణ పేదలకు 10 శాతం కోటా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సుప్రీంకోర్టు




న్యూఢిల్లీ, నవంబర్ 7: అగ్రవర్ణాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్‌ను కల్పించిన విషయం తెలిసిందే. అయితే ఆ కోటాను సవాల్ చేస్తే వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇవాళ తీర్పును వెలువరించింది. చీఫ్ జస్టిస్ యూయూ లలిత్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పును వెల్లడించారు. ఈడబ్ల్యూఎస్ కోటాను సుప్రీంకోర్టు సమర్థించింది. అయిదుగురు సభ్యులు ఉన్న ధర్మాసనంలో సీజేఐ లలిత్‌తో పాటు జస్టిస్ దినేశ్ మహేశ్వరి, ఎస్ రవీంద్ర భట్, బేలా ఎం త్రివేది, జేబీ పర్దివాలాలు ఉన్నారు.

జస్టిస్ రవీంద్ర భట్ కోటాను వ్యతిరేకించారు. దీనికి సీజేఐ యూయూ లలిత్ కూడా అంగీకారం వ్యక్తంచేశారు. జస్టిస్ లలిత్, భట్‌లు కోటాను వ్యతిరేకించారు. జస్టిస్ జేపీ పర్దివాలా, జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ త్రివేదిలు ఈడబ్ల్యూఎస్ కోటాను సమర్థించారు. దీంతో 3-2 తేడాతో పిటిషన్‌ను కొట్టివేశారు. రాజ్యాంగంలోని 103వ సవరణను సుప్రీం స్వాగతించింది. విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా అమలుకు సుప్రీం పచ్చజెండా ఊపింది.

అగ్రవర్ణ పేదలకు కోటా ఇవ్వడం చట్ట వ్యతిరేకం కాదని, రాజ్యాంగం కల్పించిన 50 శాతం సీలింగ్ పరిమితిని కూడా ఉల్లంఘించడం లేదని కోర్టు తెలిపింది. 2019 జనరల్ ఎన్నికల ముందు ఈడబ్ల్యూఎస్ కోటాను ప్రభుత్వం తీసుకువచ్చింది. రాజ్యాంగంలోని 103వ సవరణ ద్వారా ఈ కోటాను అమలు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు సుప్రీంలో పిటిషన్ వేశారు.

## నేడే సంపూర్ణ చంద్రగ్రహణం.

హైదరాబాద్, నవంబర్ 7:ఈ నెల 8న సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనున్నది. ఈ ఏడాది ఏర్పడనున్న రెండో చంద్రగ్రహణం. ఈ నెల ఇంతకు ముందు దీపావళి రోజున సూర్యగ్రహణం సంభవించగా.. 15రోజుల వ్యవధిలోనే కార్తీక పౌర్ణమి రోజున చంద్రగ్రహణం ఏర్పడబోతున్నది. ఈ ఏడాది నాలుగు గ్రహణాలు ఏర్పడగా.. ఈ గ్రహణాలు రెండువారాల వ్యవధిలోనే ఏర్పడడం విశేషం. ఈ చంద్రగ్రహణం భారత్‌తో పాటు ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా, ఉత్తర ఫసిఫిక్, హిందుమహా సముద్ర ప్రాంతాల్లో కనిపించనుండగా.. ఇలాంటి చంద్రగ్రహణం ప్రపంచవ్యాప్తంగా కనువిందు చేయనున్నది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో మధ్యాహ్నం 2.39 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6.19 గంటలకు వరకూ కొనసాగుతోంది. భారత్‌లో గ్రహణం 5.32 గంటల నుంచి 6.18 వరకు కనిపించనున్నది. దేశంలో 45 నిమిషాల 48 సెకెన్ల పాటు దర్శనమిస్తుందని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ తెలిపింది. గ్రహణం ప్రారంభమైన దాదాపు గంట తర్వాత 3.46 గంటలకు చంద్రుడు పూర్తిగా భూమి నీడలోకి వెళ్లిపోతాడు. సాయంత్రం 4.29 గంటలకు దాని ప్రభావం పూర్తిగా కనిపిస్తుంది. ఇలా 5.11 గంటల వరకూ సాగుతుంది. అప్పటి నుంచి క్రమంగా చంద్రుడి కక్ష్య నుంచి భూమి తప్పుకోవడం మొదలై సాయంత్రం 6:19 గంటలకు గ్రహణం ముగుస్తుంది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో చంద్రోదయం తర్వాత గ్రహణం చూసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

భారత కాలమానం ప్రకారం.. మధ్యాహ్నం ప్రపంచవ్యాప్తంగా గ్రహణం కనిపించనున్నది. భారత్‌లో గ్రహణం సాయంత్ర సమయంలో దర్శనమివ్వనున్నది. దేశంలోని తూర్పు ప్రాంతాలైన కోల్‌కతా సహా పలు ప్రాంతాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం కనిపించే అవకాశం ఉన్నది. చంద్రగ్రహణాన్ని నేరుగా చూడొచ్చని, ఎటువంటి పరికరాలు అవసరం లేదని శాస్త్రవేత్తలు తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే పూర్తిస్థాయిలో ఎర్రగా మారిన చంద్రుడిని చూడొచ్చని పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో చంద్రగ్రహణం 5.28 గంటలకు, ముంబైలో 6.01 గంటలకు హైదరాబాద్‌లో 5.40 గంటలకు కనిపించనున్నది.

## సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే తెలంగాణ ఆదర్శం : మంత్రి సబిత



హైదరాబాద్, నవంబర్ 7:అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మన ఊరు - మన బడి, బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నందుపల్లి గ్రామంలో సీసీ రోడ్డును, పడమటి తండా గ్రామంలో బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని సీఎం కేసీఆర్ రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేశారన్నారు. వర్షాలు తగ్గినందున పాడైన రోడ్లను బాగు చేయాలని ఆదేశించారన్నారు.

అందులో భాగంగా నాగారం నుంచి నందుపల్లి వరకు రూ.30 లక్షలు, నందుపల్లి నుంచి తండా వరకు రూ.28.లక్షలతో, పడమటి తాండాలో రూ.34 లక్షలు రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయన్నారు. పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మన ఊరు - మన బడి కార్యక్రమం కింద 12 అంశాల్లో మొదటి విడుతలో రూ.3500కోట్లతో 9వేల పాఠశాలల్లో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 464 పాఠశాలల్లో మొదటి విడుతలో రూ.200కోట్లు వెచ్చించి పనులు చేపడుతున్నామన్నారు. మహేశ్వరం మండలంలో 19 పాఠశాలలు ఈ పథకం కింద రూ.5.19 కోట్లు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

## కలెక్టర్‌ని కలిసిన సండ్ర వెంకటవీరయ్య



ఖమ్మం, నవంబర్ 7: (నేటినిజం ప్రతినిధి): పెనుబల్లి మండలం, రామచంద్రాపురం గ్రామంలో ఆదివాసుల పోడు భూములను అక్రమంగా ఆక్రమించుకొని బినామీ పేర్లతో ఉమ్మడి వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసుల యొక్క భూములను సుమారు 9 మంది ఆదివాసుల పేర అటవీ హక్కుల పత్రాలు చేయించుకొని సుమారు 72 మంది పోడు రైతుల భూములను అన్యాక్రాంతం చేసిన వ్యక్తి పై తగిన విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ఆదివాసీలతో, నాయకులతో సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఖమ్మం కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్ ని కలిసి కోరారు. ఈ ఆదివాసీలకు అటవీ హక్కుల చట్ట ప్రకారం 1980 నుంచి ఉమ్మడి వ్యవసాయం చేస్తున్నటువంటి 72 మంది రైతులకు 74 ఎకరాలకు సంబంధించిన భూమిని సమానంగా పంచి వ్యక్తిగత హక్కు పత్రాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరక్షరాసులమైన ఆదివాసులను పోడు భూముల విషయంలోనూ రెవిన్యూ భూముల విషయంలోనూ అక్కడ జరిగిన అవకతవకలను న్యాయం చేయుట కోసం ప్రత్యేకించి కేవలం అక్కడ ఉన్న ఆదివాసుల కోసం మాత్రమే ప్రత్యేక గ్రామసభను తక్షణమే ఏర్పాటు చేయాలని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఖమ్మం జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్ ని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలోని మండలాల్లోని ఆయా గ్రామాల్లో రెవిన్యూ సంబంధిత సమస్యల గల ప్రజలతో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఖమ్మం జిల్లా కలెక్టర్ ని కలసి పరిష్కరించవలసిందిగా కోరారు.

## ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్

ఖమ్మం, నవంబర్ 7: (నేటినిజం ప్రతినిధి): ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలోని ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ అంజలి తమ సిబ్బందితో నగరంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాత బస్‌స్టాండు వద్ద యూనిఫాం లేకుండా ఆటోలు నడుపుతున్న డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆటో డ్రైవర్లు సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని సిఐ అంజలి సూచించారు. ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్సు, వాహన రికార్డులు, యూనిఫామ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపడం చేయరాదని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనంలో ఎక్కించుకోరాదని, ఆటోడ్రైవర్లు విధిగా ఇన్సూరెన్స్ కట్టాలని, రోడ్ ట్యాక్స్ చెల్లించాలని, ఆటోలలో సౌండ్ బాక్సులు ఉంటే వాటిని తొలగించాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ.. అతివేగంగా వెళ్లేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నియంత్రించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని పేర్కొన్నారు.


ఆహ్వానం
రొట్టమాకురేవు కవిత్వ అవార్డు 2022
ప్రదానోత్సవ సభ

13.11.2022
ఆదివారం,
ఉ. 10:30 గం.లకు

ముంతాజ్ కాలేజి
బి-బ్లాక్, మలక్‌పేట,
హైదరాబాద్

అధ్యక్షత
ప్రసేన్

ముఖ్య అతిథి: కె.శివారెడ్డి
అవార్డు సంపుటాలపై విశ్లేషణ: లక్ష్మీనరసయ్య గుంటూరు
అభినందన: వంశీకృష్ణ
కవిత్వ అవసరం, ప్రసంగం: కోయి కోటేశ్వరరావు

అవార్డు గ్రహీతలు



షేక్ మహమ్మద్ మియా స్మారక అవార్డు – పసునూరు శ్రీధర్‌బాబు – నిదురపోని మెలకువ చెప్పిన కల
పురిటిపాటి రామిరెడ్డి స్మారక అవార్డు – వైష్ణవిశ్రీ – ఏడవ రుతువు
కె.ఎల్. నర్సింహారావు స్మారక అవార్డు – బిల్ల మహేందర్ – ఇప్పుడొక పాట కావాలి
కె.ఎల్. నర్సింహారావు స్మారక అవార్డు – పల్లిపట్టు నాగరాజు – యాలై పూడ్సింది

కవిత్వ పఠనం
కేతిరెడ్డి యాకూబ్ రెడ్డి
తెలుగు వెంకటేష్
వడ్లకొండ దయాకర్
తుల శ్రీనివాస్
నీలిమా విస్ రావు
మునిగాల ఆకాశ్
కళ్యాణి కుంజ
వేణుమాధవ్ శర్మ
రోహిణి వంజారి
తలారి సతీష్ కుమార్
బుర్ర సంతోష్ గౌడ్

పుస్తకావిష్కరణలు
శిలాలోలిత
నేను ఇక్కడి భూమిని
బిల్ల మహేందర్ (సం.)
బిల్కిస్ బానో సంఘీభావ కవిత్వం
గంగాపురం శ్రీనివాస్
పిడికెడు బువ్వకోసం

తప్పకుండా రండి!
శిలాలోలిత, కవి యాకూబ్

# ఇండియాలో ప్రమాదకరంగా మారిన క్యాన్సర్ భూతం

## (07 నవంబర్ 'జాతీయ క్యాన్సర్ అనగాహన దినం" సందర్భంగా)

శరీరంలోన ఏదైన ఒక అవయవ భాగంలో కణజాలం అపరిమితంగా, నియంత్రణ లేకుండా పెరగడం, ఇతర కణజాలానికి వ్యాపించడం వల్ల గడ్డలు ఏర్పడే అనారోగ్య స్థితిని క్యాన్సర్ వ్యాధిగా పిలుస్తారు. అతి ప్రమాదకర క్యాన్సర్ వ్యాధికి పూర్తి చికిత్స నేటికీ లేదు. క్యాన్సర్ రాకుండా నివారణ చర్యలు, తొలి దశలో గుర్తించుట వల్ల చికిత్సతో నయం చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా మానవాళికి క్యాన్సర్ వ్యాధి పట్ల కనీస అవగాహన, క్యాన్సర్ బారిన పడకుండా ఉండటానికి తీసుకోవలసిన నివారణ చర్యలు, తొలి దశలో గుర్తించే పద్ధతులు లాంటి మౌళిక అంశాలను వివరించే సదుద్దేశంతో ప్రతియేటా 07 నవంబర్ రోజున "జాతీయ క్యాన్సర్ అవగాహన దినాన్ని" 2014 నుండి పాటించడం జరుగుతోంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగపడే రేడియోషన్ థెరపీకి కారణమైన రేడియం, పొలోనియం రేడియోధార్మిక మూలకాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రజ్ఞురాలు నోబెల్ బహుమతి గ్రహీత మేడమ్ మేరీ క్యూరీ జన్మ దినం 07 నవంబర్‌కు గుర్తుగా జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భాన్ని వినియోగించుకుంటారు.

క్యాన్సర్‌లలో రకాలు: క్యాన్సర్‌లలో 100కు పైగా రకాలు ఉంటాయి. వీటిలో రొమ్ము, ఊపిరితిత్తులు, నోటి, చర్మ, గర్భాశయ, పాంక్రియాస్, ప్రోస్టేట్, ఎముకలు లాంటి అవయవాలకు క్యాన్సర్ వస్తుంది. క్యాన్సర్‌లలో కార్సినోమా (చర్మ, రొమ్ము, ప్యాంక్రియాస్, ఇతర గ్రంధులకు), సర్కోమా (రక్తనాళాలు, ఎముకలు, కార్టిలేజ్, కొవ్వు, కండరాలకు), మెలనోమా (చర్మ పిగ్మెంట్ కణాలు), లింఫోమా (లింఫోసైట్స్) మరియు ల్యుకేమియా (రక్తం) వర్గాలు ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్లలో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అతి ప్రమాదకరమైందిగా గుర్తించబడింది. మన దేశంలో ప్రతి రోజు 1300 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్థులు మరణిస్తున్నారని తేలింది. ఇండియాలో పురుషులకు ఊపిరితిత్తుల క్యాన్సర్, స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్‌లు ప్రాణాంతకంగా మారాయి.

క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, చికిత్స మార్గాలు: క్యాన్సర్ వ్యాధికి ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించని కారణంగా రోగ నిర్ధారణ చేయడం కష్టం అవుతున్నది. ఒక వేళ ముందుగా వ్యాధి నిర్ధారణ జరిగితే, చాలా సందర్భాలలో వైద్యంతో నయం చేసే అవకాశం ఉంటుంది. క్యాన్సర్ వ్యాధి లక్షణాలుగా విరోచనాలు, దగ్గు, చర్మంపై మచ్చలు ఏర్పడడం, ఉమ్మితో రక్తం పడడం, రక్తహీనత, రొమ్ములో గడ్డలు, మూత్ర సంబంధ మార్పులు, మలంలో రక్తం పడడం, బీజాలలో గడ్డలు లాంటివి గుర్తించబడతాయి. ఇండియాలో రొమ్ము, గర్భాశయ, ఊపిరితిత్తులు, జీర్ణకోశ, పెద్ద ప్రేగు క్యాన్సర్‌లు మాత్రమే దాదాపు 50 శాతం కనిపిస్తాయి. క్యాన్సర్ వ్యాధి చికిత్సలో ఇమ్యునోథెరపీ, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, స్టెమ్ సెల్ మార్పిడి, శస్త్రచికిత్స, ప్రిసిషన్ మెడిసిన్ లాంటి విధానాలు వాడతారు.

### క్యాన్సర్ నివారణకు జాగ్రత్తలు:

శరీర బరువు నియంత్రణ, మంచి పోషకాహార అలవాటు, శారీరక శ్రమ, టీకాలు వేయించుకోవడం, తీవ్రమైన ఎండ పడకుండా జాగ్రత్తలు, పొగాకు ఉత్పత్తులకు అలవాటుకు దూరంగా ఉండడం, క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోవడం, శరీరంలో గడ్డలు కనిపిస్తే వైద్యున్ని సంప్రదించడం వంటి సత్వర జాగ్రత్తలు తీసుకోవడం లాంటి జాగ్రత్తల వల్ల క్యాన్సర్ వ్యాధి నివారించబడుతుంది. దీనికి తోడుగా ఆల్కహాల్ సేవనం, మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఆహారలేమి, పోషకాహారలోపం, అసురక్షిత లైంగిక సంబంధాలు, గాలి కాలుష్యం లాంటి కారణాలతో క్యాన్సర్ వ్యాధి రావచ్చనే కనీస అవగాహన కలిగి ఉండాలి.

ఇండియాలో ప్రమాదకరంగా మారిన క్యాన్సర్: ప్రపంచవ్యాప్తంగా అసంక్రమిత వ్యాధులతో 71 శాతం మరణాలు నమోదు అవుతున్నాయి. ఇండియాలో అసంక్రమిత వ్యాధులతో 63 శాతం మరణాలు జరుగుతుండగా, 9 శాతం మంది క్యాన్సర్ వ్యాధులతో చనిపోతున్నారు. 1975లో ప్రారంభించిన జాతీయ క్యాన్సర్ నియంత్రణ ప్రోగ్రామ్ (నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ ప్రోగ్రామ్) ద్వారా క్యాన్సర్‌కు వైద్య సదుపాయాలను దేశవ్యాప్తంగా నెలకొల్పడం, 1984-85 నుంచి నివారణ చర్యలు మరియు తొలి దశలో గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, హంగేరీ, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఐర్లాండ్, యూయస్ లాంటి దేశాలలో క్యాన్సర్ బారిన పడిన వ్యాధిగ్రస్థుల శాతం ఎక్కువగా ఉంది. ప్రపంచ క్యాన్సర్ రోగుల్లో 8.17 శాతం వ్యాధిగ్రస్థులు ఇండియాలోనే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. భారత్‌లో 2.25 మిలియన్ల క్యాన్సర్ రోగులు ఉండగా, ప్రతియేటా 1.1 మిలియన్ల క్యాన్సర్ కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. వీటిలో దాదాపు 66 శాతం కేసులు క్యాన్సర్ ముదిరిన తరువాతనే బయట పడడంతో వ్యాధిగ్రస్థుడి ప్రాణం కాపాడడం కష్టం అవుతున్నది. ఇండియాలో ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ క్యాన్సర్‌తో మరణించడం విచారకరం. భారతీయుల్లో ప్రతి పది మందిలో ఒకరికి తమ జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, చనిపోయిన ప్రతి 15 మందిలో ఒకరు క్యాన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని అంచనా. 2018లో దేశవ్యాప్తంగా 3.18 లక్షల మరణాలు పొగాకు ఉత్పత్తుల అలవాటు కారణ క్యాన్సర్‌తో జరిగాయని తేలింది. పురుషుల్లో 25 శాతం క్యాన్సర్ మరణాలు నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో నమోదు కావడం, 25 శాతం క్యాన్సర్ మహిళా మరణాలు రొమ్ము, నోటి క్యాన్సర్‌తో జరుగుతున్నాయి. పొగాకు వాడకంతో 14 రకాల క్యాన్సర్‌లు రావడం గమనించారు.

ప్రాణాంతర క్యాన్సర్ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కలిగి, క్రమశిక్షణ గల జీవనశైలితో ఆరోగ్యకర సమాజ స్థాపనలో భాగస్వాములం అవుదాం. క్యాన్సర్ భూతాన్ని సమాజం నుంచి తరిమి కొడదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# శ్రీకాకుళం జిల్లాలో దారుణ ఘటన



అమరావతి: నవంబర్ 7:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా మందస మండలం హరిపురంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో ప్రత్యర్థులు ఇద్దరు మహిళలపై దాష్టీకానికి ఒడిగట్టారు. ఇద్దరు మహిళలపై ట్రాక్టర్ తో కంకర మట్టి వేశారు. గమనించిన స్థానికులు మట్టిని తొలగించి మహిళలను కాపాడారు. హరిపురం గ్రామానికి చెందిన ఆనందరావు, ప్రకాశ్ రావు, రామారావులు తమ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధిత మహిళలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తమను, తమ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు. ఆనందరావు, ప్రకాశ్ రావు, రామారావులపై చర్యలు తీసుకోవాలని వేడుతున్నారు.

# అన్ని చక్కెర మిల్లులకు 60 ఎల్ఎంటీ ఎగుమతి కోటా కేటాయించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, నవంబర్ 7:దేశంలో పంచదార ధరల స్థిరీకరణ , చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు 2022-23 చక్కెర సీజన్ లో 60 ఎల్ఎంటీ పంచదార ఎగుమతి చేసేందుకు చక్కెర మిల్లులకు అనుమతి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలో చెరకు ఉత్పత్తికి సంబంధించి రూపొందిన ప్రాథమిక అంచనాల ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పంచదార ఎగుమతులను 'పరిమితం చేయబడిన' కేటగిరీ కింద 31 అక్టోబర్, 2023 వరకు పరిగణిస్తూ ఆఉఈ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది.

దేశంలో వినియోగం కోసం దాదాపు 275 లక్షల మెట్రిక్ టన్నుల(ఎల్ఎంటీ) పంచదార, ఇథనాల్ ఉత్పత్తి కోసం దాదాపు 50 ఎల్ఎంటీ పంచదార ను ప్రభుత్వం కేటాయించింది. ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల దేశంలో 30.09.2023 నాటికి దాదాపు 60 ఎల్ఎంటీ పంచదార ముగింపు నిల్వలు ఉన్నాయి. దీనికి మించి చక్కెర మిల్లులు ఉత్పత్తి చేసే పంచదార ఎగుమతి చేయడానికి అనుమతించబడుతుంది. 2022-23 చక్కెర సీజన్ లో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్న చెరుకుకు సంబంధించి ప్రాథమిక అంచనాలు సిద్ధం కావడంతో 60 ఎల్ఎంటీ పంచదార ఎగుమతి చేయడానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. చెరుకు ఉత్పత్తి జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు సమీక్షించి, పంచదార ఎగుమతులపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుంది.

2021-22 చక్కెర సీజన్ లో భారతదేశం నుంచి 110 ఎల్ఎంటీ పంచదార ఎగుమతి అయింది. ప్రపంచంలో పంచదార ఎగుమతిలో రెండో అతిపెద్ద దేశంగా భారతదేశం గుర్తింపు పొందింది. పంచదార ఎగుమతుల ద్వారా దేశం దాదాపు 40,000 లక్షల కోట్ల విలువ చేసే విదేశీ మారకద్రవ్యం ఆర్జిస్తోంది. సకాలంలో జరుగుతున్న చెల్లింపులు, చక్కెర మిల్లుల రవాణా ఖర్చులు తగ్గడంతో రైతులకు చెల్లించాల్సిన చెరకు బకాయిలను త్వరితగతిన చెల్లించేందుకు వీలు కలిగింది. 2021-22 చక్కెర సీజన్ లో రికార్డు స్థాయిలో 1.18లక్షల కోట్ల రూపాయల విలువ చేసే చెరకు సేకరించడం జరిగింది. 31.10.2022 నాటికి రైతుల చెరకు బకాయిల్లో 96% కంటే ఎక్కువ ఇప్పటికే చెల్లించడం జరిగింది.

2022-23 చక్కెర సీజన్ కోసం ప్రభుత్వం రూపొందించిన పంచదార ఎగుమతి విధానంలో దేశంలోని అన్ని చక్కెర మిల్లులకు మిల్లుల వారీగా ఎగుమతి కోటాను ప్రభుత్వం నిర్ణయించింది. గత మూడేళ్లలో చక్కెర మిల్లుల సగటు ఉత్పత్తి మరియు దేశంలోని గత 3 సంవత్సరాల కాలంలో జరిగిన సగటు చక్కెర ఉత్పత్తి ఆధారంగా ఎగుమతి విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. పంచదార ఎగుమతులను వేగవంతం చేయడానికి మరియు ఎగుమతి కోటా అమలు చేయడంలో చక్కెర మిల్లులకు సౌలభ్యాన్ని కల్పించడానికి కూడా ప్రభుత్వం చర్యలు ప్రకటించింది. దీని ప్రకారం మిల్లులు ఆర్డర్ జారీ చేసిన తేదీ నుండి 60 రోజులలోపు కోటాను పాక్షికంగా లేదా పూర్తిగా సరెండర్ చేయవచ్చు లేదా ఎగుమతి కోటాను స్వదేశీ కోటాగా మార్చుకోవచ్చు. మార్పిడి అవకాశం కల్పించడం వల్ల రవాణా ఖర్చులు తగ్గుతాయి. ప్రభుత్వ విధానం వల్ల ఎగుమతి కోసం దూర ప్రాంతాల నుంచి ఓడ రేవులకు పంచదార తరలించాల్సిన అవసరం ఉండదు. అదేవిధంగా దేశంలో వినియోగించడానికి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పంచదార తరలించాల్సిన అవసరం ఉండదు. సమీపంలో ఓడ రేవు అందుబాటులో లేకపోవడంతో పంచదార ఎగుమతి చేయడంలో విఫలమైన మిల్లులు తమ కోటాను ఎగుమతి చేయడానికి సౌకర్యాలు కలిగి ఉన్న మిల్లులకు మార్చడానికి ప్రభుత్వ విధానం అనుమతి ఇస్తుంది. దీనివల్ల, పేరుకు పోయిన పంచదార నిల్వలు తగ్గుతాయి. 2022-23 చక్కెర సీజన్ లో చక్కెర మిల్లులు తమ ఉత్పత్తిని ఎగుమతి చేయడం లేదా స్వదేశీ మార్కెట్లో విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతో రైతులకు బకాయి పడిన మొత్తాలు చెల్లించగలుగుతాయి.

ప్రభుత్వ విధానం చక్కెర మిల్లులకు ఒక వరంగా ఉంటుంది.

స్వదేశీ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు పంచదార ధరను అదుపు చేయాలన్న లక్ష్యంతో పంచదార ఎగుమతి విధానం రూపొందింది. పంచదార ఎగుమతులను పరిమితం చేయడం వల్ల దేశీయ ధరలు అదుపులో ఉంటాయి. దేశీయ మార్కెట్‌లో పెద్దగా ద్రవ్యోల్బణ పోకడలు తలెత్తవు. మార్కెట్ ధరలు నామమాత్రంగా పెరుగుదల నమోదు చేశాయి. ఇది రైతులకు చెరకు ఈఖీఖ పెరుగుదలకు అనుగుణంగా ఉంది.

దేశంలో ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి మరియు గ్రీన్ ఎనర్జీ వైపు వెళ్లడానికి దేశంలో ఇథనాల్ ఉత్పత్తి ఎక్కువ చేసే అంశానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇథనాల్ ధరలు ఎక్కువగా ఉండడంతో డిస్టిలరీలు తమ చక్కెర ఉత్పత్తిని ఇథనాల్ రంగానికి మళ్లించడానికి మొగ్గు చూపుతున్నాయి. ప్రభుత్వ్ ప్రకటించిన చక్కెర ఎగుమతి విధానం వల్ల ఇథనాల్ ఉత్పత్తికి సరిపడా చెరకు/చక్కెర/మొలాసిస్ అందుబాటులో ఉంటుంది. ఇథనాల్ ఉత్పత్తి కోసం 2022-23 లో 45-50 ఎల్ఎంటీ చక్కెర సరఫరా అవుతుందని అంచనా వేయబడింది.

పంచదార ఎగుమతులకు అనుమతులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం చెరకు రైతులు మరియు చక్కెర కర్మాగారాల ప్రయోజనాల పరిరక్షణకు కూడా చర్యలు తీసుకుంది. ప్రభుత్వ విధానం వల్ల మిల్లులు అనుకూలమైన అంతర్జాతీయ చక్కెర ధర దృష్టాంతంలో ప్రయోజనాలను పొందుతాయి.తమ ఉత్పత్తికి మెరుగైన ధర పొందుతాయి. దీనివల్ల ప్రస్తుత చక్కెర సీజన్ 2022-23లో రైతుల చెరకు బకాయిలు సకాలంలో చెల్లించబడతాయి. చక్కెర నిల్వలు తగ్గడం వల్ల వర్కింగ్ క్యాపిటల్ ఖర్చు కూడా తగ్గుతుంది.

చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడానికి, స్వావలంబన సాధించడానికి ఉపకరించే విధంగా గత 6 సంవత్సరాల కాలంలో ప్రభుత్వం చక్కెర రంగంలో బహుళ మరియు సమయానుకూల చర్యలు అమలు చేసింది. 2022-23 చక్కెర సీజన్ లో చక్కెర మిల్లులకు పంచదార ఉత్పత్తి/మార్కెటింగ్‌కు ఎలాంటి సబ్సిడీ ఇవ్వలేదు. ప్రస్తుత సీజన్‌లో కూడ, భారత ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక సహకారం లేకుండా దేశంలో చక్కెర రంగం పని చేస్తుందని భావిస్తున్నారు. ఇథనాల్ ఉత్పత్తికి చక్కెర మళ్లించడం, లభ్యత ప్రకారం మిగులు పంచదార ఎగుమతి చేయడానికి అనుమతి మంజూరు చేసి కేంద్ర ప్రభుత్వం సుమారు 5 కోట్ల చెరకు రైతు కుటుంబాలతో పాటు ఇథనాల్ డిస్టిలరీలు, చక్కెర మిల్లులపై ఆధారపడి జీవిస్తున్న దాదాపు 5 లక్షల కార్మికుల ప్రయోజనాలు రక్షించింది. ప్రభుత్వం తీసుకున్న సానుకూల నిర్ణయం వల్ల ఇథనాల్ డిస్టిలరీలు, చక్కెర మిల్లులు అభివృద్ధి పథంలో నడుస్తాయి.

# దేశ రక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం -మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

అమరావతి: నవంబర్ 7:దేశ రక్షణలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. విద్యార్థి దశ నుంచే దేశాన్ని కాపాడుకోవాలనే పట్టుదల అలవర్చుకోవడం వల్ల మన దేశం ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా మారుతుందన్నారు. కర్నూలు నగర శివార్లలోని బీ.తాండ్రపాడులో సైనిక్ స్కూల్ శిక్షణ కోసం ఏర్పాటు చేసిన జెనిత్ కోచింగ్ సెంటర్ ను ఆయన ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యార్థులుగా ఉన్నప్పుడే జీవితంలో ఎత్తుపల్లాల గురించి తెలుసుకోవడానికి సైనిక్, మిలిటరీ స్కూళు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులకు సైనిక్ స్కూల్ శిక్షణ ఇవ్వడానికి అన్ని సౌకర్యాలతో కోచింగ్ సెంటర్ ను ప్రారంభించడం అభినందనీయమని చెప్పారు. సంస్థ చైర్మన్ ఎన్వీ ఖాన్ మాట్లాడుతూ.. తమ సంస్థలో సైనిక్ స్కూల్, రాష్ట్రీయ మిలిటరీ స్కూల్, నవోదయ, గురుకుల స్కూళ్లలో ప్రవేశాలకు బాల, బాలికలకు అత్యున్నత శిక్షణతో పాటు వేర్వేరుగా హాస్టల్ వసతి కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో మానసిక దృఢత్వాన్ని పెంపొందించడానికి తమ కోచింగ్ సెంటర్ లోనే యోగా, మెడిటేషన్ శిక్షణ కూడా ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సతీష్ కుమార్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# అనంత కలెక్టర్‌పై మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఫైర్



అమరావతి: నవంబర్ 7: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ టీడీపీ నాయకులు జేసీ ప్రభాకర్ రెడ్డి అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పై చిందులు వేశాడు. తాడిపత్రి నియోజకవర్గంలోని సజ్జలదిన్నె ప్రభుత్వ భూమి వ్యవహారంపై ఫిర్యాదు చేసి ఏడాదిన్నర కావస్తున్న ఎలాంటి చర్యలు తీసుకోలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి పై జేసీ ప్రభాకర్ రెడ్డి పేపర్లు విసిరేశారు. సమాధానం చెప్పాలని కోరారు. కోట్ల విలువచేసే భూమికి సంబంధించి ఫిర్యాదు చేస్తే స్పందించరా అంటూ కలెక్టర్ పై మండిపడ్డారు. దీంతో కలెక్టర్ మీరు వెళ్లచ్చని సమాధానం ఇచ్చారు. ఇది తప్ప నీకేం చేతనవుతుందని జేసీ ప్రభాకర్ రెడ్డి కలెక్టర్ తో అన్నారు. కలెక్టర్ అయ్యే అవకాశం అందరికీ రాదని ఇది దేవుడు ఇచ్చిన వరమని న్యాయం చేయండి అని ఊగిపోతూ కలెక్టర్ పై మండిపడ్డాడు జేసీ ప్రభాకర్ రెడ్డి. కలెక్టర్ పై దురుసుగా మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన గన్ మ్యాన్ ను జేసి ప్రభాకర్ రెడ్డి చేతులతో వెనక్కి నెట్టాడు.

ఆహ్వానం

విశాలాంధ్ర 21వ వి-శాఖ పుస్తక మహోత్సవం

తేది 13-11-2022 నుండి 05-12-2022 వరకు

విశాఖపట్నం మెయిన్ రోడ్, "టర్నర్ చౌల్ట్రీ ఆవరణలో"

ప్రారంభోత్సవ సభ :

తేది 13-11-2022 ఆదివారం ఉదయం గం. 10-30 ని.లకు

అధ్యక్షులు : శ్రీ జె.వి. సత్యనారాయణమూర్తి
సి.పి.ఐ. రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్

ప్రారంభోత్సవం : శ్రీ గుడివాడ అమరనాథ్
భారీ పరిశ్రమలు & ఐ.టి. శాఖామంత్రివర్యులు

ముఖ్య అతిథి : శ్రీ ఎ. రాజబాబు, ఐ.ఎ.ఎస్.
కమీషనర్, జి.వి.యం.సి. విశాఖపట్నం

అతిథులు : డా॥ పి. మైథిలి
సూపరింటెండెంట్, కె.జి.హెచ్., విశాఖపట్నం
శ్రీ సుమిత్ భట్టాచార్జీ
ప్రిన్సిపాల్, కరస్పాండెంట్, చీఫ్ సబ్ ఎడిటర్, ది హిందూ
శ్రీ టి. మనోహర్‌నాయుడు
మేనేజర్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

పి.ఎ. రాజు, మేనేజర్
విశాలాంధ్ర బుక్ హౌస్
విశాఖపట్నం, సెల్ : 9849257925

పుస్తక ప్రియులందరికీ ఇదే మా ఆహ్వానం

# దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థలలో జనజాతీయ గౌరవ్ దివస్‌ను ఘనంగా నిర్వహించనున్న విద్యామంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 7:దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, వృత్తిపరమైన ఉన్నత స్థాయి విద్యా సంస్థలు కేంద్ర విద్య, నైపుణ్యాలు ఉవ్యవస్థాపకత శాఖల మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ నేతృత్వంలో జనజాతీయ గౌరవ్ దివస్‌ను ఘనంగా జరుపుకోనున్నాయి.

గత ఏడాది వీరులైన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల స్మారకార్థం ప్రతి ఏడాది నవంబర్ 15ను జనజాతీయ గౌరవ్ దివస్ గా ప్రకటించింది. దేశవ్యాప్తంగా గిరిజన సమూహాలు భగవంతుడిగా భావించే బిర్సా ముండా జయంతి నవంబర్ 15వ తేదీన. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త, దేశంలో అత్యంత గౌరవాన్ని అందుకునే గిరిజన నాయకుడైన బిర్సా ముండా బ్రిటిష్ సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాహసోపేతంగా పోరాడి, తన జీవిత కాలంలోనే కీర్తినార్జించాడు. ఆయనను తరచుగా భగవాన్ అని ప్రస్తావిస్తారు. గిరిజనులకు ఉల్గులాన్ (తిరుగుబాటు) పిలుపునిచ్చి, గిరిజన ఉద్యమాన్ని నిర్వహించి, నాయకత్వం వహించారు. తమ సాంస్కృతిక మూలాలను తెలుసుకొని, ఐకమత్యంగా ఉండాలని గిరిజనులను ఆయన ప్రోత్సహించారు.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన కృషిని స్మరించుకునేందుకు, ఎఐసిటిఇ, యుజిసి, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలు, సిబిఎస్ఇ, కెవిఎస్, ఎన్ విఎస్, వృత్తినైపుణ్యాలను బోధించే సంస్థలను కలుపుకుని విద్యా మంత్రిత్వ శాఖ జనజాతీయ గౌరవ దివస్ ను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థలలో స్వాతంత్ర్య సమరంలో జనజాతి యోధుల కృషి అన్న ఇతివృత్తం పై చర్చల పోటీ, సామాజిక కార్యకలాలు, తదితరాలతో సహా పెద్ద సంఖ్యలో కార్యక్రమాలు జనజాతీయ గౌరవ్ దివస్ దేశవ్యాప్త వేడుకలలో చోటు చేసుకోనున్నాయి. ఈ వేడుకల సందర్భంగా భగవాన్ బిర్సా ముండా, ఇతర యోధులైన గిరిజన నాయకుల కృషిని పట్టి చూపనున్నారు. పనిలో రాణించిన విద్యార్థులను సన్మానిస్తారు. ఈ వేడుకలు దేశం కోసం గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను, వారి వారసత్వాన్ని ముందుకు తీసుకువెడుతూ, గిరిజన సంస్కృతి, కళలు, సుసంపన్నమైన గిరిజన వారసత్వాన్ని భవిష్యత్ తరాలు గుర్తించడానికి స్ఫూర్తినిస్తాయి.

# అధికారులు రబీకి సిద్ధంగా ఉండాలి.. సీఎం జగన్

అమరావతి: నవంబర్ 7:అధికారులు రబీకి అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. వ్యవసాయ శాఖపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ? ఎంఎస్పీ కన్నా తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందనే మాట రావొద్దని సీఎం జగన్ సూచించారు. దీన్ని అధికారులు సవాల్ గా తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర లేకుండా చేస్తున్నామన్నారు.వ్యవసాయ శాఖతో పౌరసరఫరాల శాఖ అనుసంధానం కావాలన్నారు. రైతులకు మంచి జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆర్బీకేలో ఒక డ్రోన్ ను ఉంచేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. భూసార పరీక్షలు చేసే పరికరాలను ఆర్బీకేల్లో ఉంచాలన్నారు.

# యాదాద్రీశుడికి రికార్డు స్థాయి ఆదాయం.. ధర్మదర్శనానికి ఐదు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు

యాదగిరిగుట్ట, నవంబర్ 7: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులతో యాదగిరికొండ, పట్టణం కిటకిటలాడింది. ఆర్టీసీ ఉచిత బస్సులు, ప్రైవేటు వాహనాల ద్వారా భక్తులు కొండ పైకి చేరుకున్నారు. ధర్మదర్శనం, ప్రత్యేక దర్శనం, బ్రేక్ దర్శనం ద్వారా ప్రధానాలయంలోకి ప్రవేశించిన భక్తులు స్వయంభువులను దర్శించుకొని తరించారు.

ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ధర్మదర్శనానికి ఐదు గంటల సమయం పట్టింది. సువర్ణ పుష్పార్చన పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. 1349 మంది దంపతులు శ్రీ సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్నారు. మహిళలు, యువతులు కార్తీక దీపాలను వెలిగించారు. వివిధ విభాగాలు కలుపుకొని ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు రికార్డు స్థాయిలో శ్రీవారిఖజానాకు రూ. 85,62,851 ఆదాయం సమకూరింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



# అల్లాహ్ విధేయత అంశంపై జమియత్ అహ్లే హాదిస్ ఆధ్యాత్మిక సదస్సు..



కరీంనగర్, నవంబర్ 5 (నేటినిజం ప్రతినిధి): నగరంలోని ఐబీఏ గార్డెన్ లో జమియత్ అహ్లే–హదీస్ కరీంనగర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో అల్లాహ్ కు విధేయత అనే అంశంపై ఆధ్యాత్మిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు పెద్దఎత్తున ముస్లింలు హాజరై విజయవంతం చేశారు. ఈ సదస్సుకు ప్రఖ్యాత పండితుడు ఫజిలతుషైఖ్ హాఫీజ్ జలాలుద్దీన్ ఖాస్మీ, అతీఉల్లాహ్ వ అతీర్రసూల్.. (అల్లాహ్ విధేయత.. ముహమ్మద్ సల్లం) అనే అంశంపై ప్రసంగించారు. షేఖ్ రయీసుల్లాహ్ సలఫి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు నేమతుల్లా అధ్యక్షత వహించారు. ఇలియాస్ అబూ ముజాహిద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అబ్దుల్ ఖదీర్ రాష్ట్ర కోశాధికారి, షేక్ యూసుఫ్ ఖాన్ ఉమ్రీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జమాతే ఇస్లామీ కరీంనగర్ అధ్యక్షుడు ఖైరుద్దీన్ తదితరులు మాట్లాడారు. హాజరయ్యారు. కరీంనగర్ జిల్లా సయ్యద్ ఇస్మాయిల్ జిల్లా అధ్యక్షుడు, జనాబ్ అబ్దున్ సమీ జిల్లా ఉపాధ్యక్షులు, సయ్యద్ హైదర్ జిల్లా కోశాధికారి పర్యవేక్షణలో సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో షేక్ ఖాలీద్ నద్వి అధ్యక్షుడు, షేక్ హాఫీజుల్లా జనరల్ సెక్రటరీ, మహ్మద్ షఫీక్ అహ్మద్ కోశాధికారి, మహమ్మద్ నవాజ్ ఉద్దీన్ వైస్ ప్రెసిడెంట్, మహమ్మద్ అబ్దుల్ హకీమ్, మిన్హాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9 నుండి 12 వరకు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్.

సంగారెడ్డి, నవంబర్ 07 (నేటి నిజం ప్రతినిధి) జహీరాబాద్ మండలం రంజోల్ లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 8వ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్(మల్టీ జోన్–2) ను ఈనెల 9 నుండి 12 వరకు నిర్వహించనున్నట్లు రంజోల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇట్టి స్పోర్ట్స్ మీట్ లో రాష్ట్రంలోని 56 గురుకుల పాఠశాలల నుండి 882 మంది బాలికలు పాల్గొననున్నట్లు తెలిపారు.

కబడ్డీ ,కోకో ,వాలీబాల్ ,హ్యాండ్ బాల్, బాల్ బ్యాడ్మింటన్, టేన్నికాయిట్(డబుల్), చెస్ (సింగిల్), క్యారమ్స్ (డబుల్) పోటీలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా అథ్లెటిక్స్ లో వంద,200,400,600,800,1500,3000 మీటర్లు, షాట్ పుట్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హై జంప్ తదితర పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఇట్టి స్పోర్ట్స్ మీట్ ను రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీర్ హరీష్ రావు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులు బేబీ పాటిల్, జహీరాబాద్ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జడ్పీ చైర్ పర్సన్, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్ పాల్గొంటారని తెలిపారు.

# బిజెపి నాయకుడు గోపు బాలరాజును పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 7: (నేటినిజం ప్రతినిధి): జిల్లా బిజెపి నాయకుడు గోపు బాలరాజు మాతృమూర్తి గోపు మల్లవ్వ అనారోగ్యంతో మృతి చెందింది . సోమవారం ఏనుగు మనోహర్ రెడ్డి మృతురాలు కొడుకులు గోపు బాలరాజు,మల్లేశం తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లవ్వ భౌతికకాయాన్నినివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు .ఏనుగు మనోహర్ రెడ్డితో పాటు మృతురాలు మల్లవ్వ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో నాగయ్య పల్లి సర్పంచ్ సుమన్ టీఆర్ఎస్ పార్టీ రూరల్ అధ్యక్షుడు గోస్కుల రవి , సీనియర్ జర్నలిస్టు గడ్డం సత్యనారాయణ రెడ్డిఉన్నారు .అలాగే ఏనుగు మనోహర్ రెడ్డి మర్రి పల్లి గ్రామంలో మృతి చెందిన మాజీ సర్పంచ్ జాగీరు సత్యనారాయణగౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు .

# అగ్ర వర్గాల నిరుపేదలకు రిజర్వేషన్ హర్షణీయం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 7: (నేటినిజం ప్రతినిధి): ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ల రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు తీర్పు కీలక తీర్పు వెలువరించింది అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సమర్థించింది ఈ తీర్పుపై రెడ్డి సంక్షేమ సంఘము విద్యార్థి విభాగం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మోతె రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాలలో ఉన్న పేదలకు రిజర్వేషన్లు వల్ల ఎంతో మేలు జరుగుతుంది అని పేర్కొన్నారు....

# జోడో యాత్రలో పాల్గొన్న వేములవాడ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 7: (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న జోడో పాదయాత్రలో సోమవారం వేములవాడ పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు .వేములవాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిఆది శ్రీనివాస్ తో పాటు వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొన్నారు రాహుల్ గాంధీ పాదయాత్ర తో దేశంలో పెను మార్పులు రావటం ఖాయమని ఆది శ్రీనివాస్ అన్నారు .జోడో పాదయాత్ర లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ,పాత సత్యలక్ష్మి , బీమాజ్ కనకరాజ్, కనికరపు రాకేశ్ ,రాముగౌడ్ అరుణ్ తేజచారి,వేములవాడ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# శాసాహబ్ మొహాల్ల లో మహ్ఫిల్ హుజూర్ గౌసేపాక్ ఆధ్యాత్మిక సదస్సు విజయవంతం..

## -పెద్దఎత్తున హాజరైన ముస్లింలు..అన్నదానం



కరీంనగర్, నవంబర్ 5 (నేటినిజం ప్రతినిధి): గ్యార్వీ షరీఫ్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నగరంలోని 47వ డివిజన్ పరిధిలో షాసాహేబ్ మొహాల్ల లో నిర్వహించిన మహ్ఫిల్ గౌసే పాక్ ఆధ్యాత్మిక సదస్సు (జల్సా) విజయవంతమైంది. వందలాది గా ముస్లింలు తరలివచ్చి విజయవంతం చేశారు. ఈ ఆధ్యాత్మిక సదస్సును గత 8సంవత్సరాలుగా నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. ఈసదస్సుకు ముఖ్య సమన్వయ కర్త, సభాధ్యక్షతగా సయ్యద్ హమ్మాదుల్ హసన్ ఖాద్రి చిస్తీ గద్దీ నషీన్ అజ్మీర్ దర్గాహ్ నుండి..ముఖ్య ప్రసంగకర్త గా నబీరాయే మజ్హరే ఆల హజ్రత్ అల్లమా ముఫ్తి అల్హాజ్ షాయాన్ రజా ఖాద్రి చిస్తీ హష్మతి డొకమ్ ఉత్తరప్రదేశ్ నుండి..ముఖ్యఅతిథిగా హజ్రత్ సయ్యద్ షా ఖాజా మోహియుద్దీన్ ఖాద్రి కమాల్ పాషా లు హాజరయ్యారు. జికర్.. ఫాతెహ ఖానీ ప్రార్థనల అనంతరం గౌసేపాక్ జెండాను ఆవిష్కరించారు. జల్సా అనంతరం లంగరే గౌసేపాక్ పెద్ద ఎత్తున వేలాదిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సయ్యద్ ఖమరుద్దీన్ ఖాద్రి, సయ్యద్ షా మోహియుద్దీన్ ఖాద్రి, సయ్యద్ తల్లత్ ఖాద్రి, సయ్యద్ రహీముద్దీన్ ఖాద్రి, సయ్యద్ బిలాల్ ఖాద్రి, సైఫ్ ఖాద్రి, జామా మస్జిద్ అధ్యక్షుడు సయ్యద్ షా యూసుఫ్ఉద్దీన్ ఖాద్రి రియజోద్దీన్ తదితరులు ఉన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74,Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.

